క్లుప్తంగా

నాడు-నేడు పనుల పరిశీలన


ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను బుధవారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పరిశీలించారు. తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డు, సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని రాసిన తీరును ఎమ్మెల్యే పరిశీలించారు. నాడు-నేడు నిధులతో ఆధునీకీకరించిన ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్‌లను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల ఆవరణలో ఉన్న స్టేజ్ ఎత్తును పెంచాలని ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావుకు సూచించారు. ప్రభుత్వం కల్పించిన సదుపాయాలతో చక్కగా చదువుకుని మంచి ఫలితాలు తీసుకువచ్చి, కళాశాలకు పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

సీఐ హరి బాధ్యతల స్వీకరణ



నర్సీపట్నం: రూరల్ సీఐగా బి.హరి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తానన్నారు. నర్సీపట్నం సర్కిల్‌పై తనకు సమగ్రమైన అవగాహన ఉందని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

హైస్కూల్‌కు కుర్చీల వితరణ


కుర్చీలు అందజేస్తున్న భాస్కరరావు

గొలుగొండ: చోద్యం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు మాతిరెడ్డి భాస్కరరావు రూ.30వేల విలువైన కుర్చీలను వితరణగా అందజేశారు. ఈ హైస్కూల్ అభివృద్ధికి గతంలో కూడా ఆయన సహకరించినట్టు హెచ్ఎం రత్నాజీ తెలిపారు. స్థానికులు కూడా సహకారం అందించాలని కోరారు. భాస్కరరావును ఉపాధ్యాయులు అభినందించారు .

నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పనే లక్ష్యం

మాడుగుల: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకాన్ని అమలు చేస్తోందని ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 18 ఏళ్లునిండిన యువతీయువకులు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.వి.రత్నం, ఏడీ వి.చిట్టినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిబాధిత కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం


చెక్కు అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

నర్సీపట్నం: అగ్నిబాధిత కుటుంబానికి వాసవీ కల్యాణమండపం సభ్యులు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. పట్టణంలోని శివపురంలో నివాసం ఉంటున్న మోటు మర్రి శ్రీనివాసరావు తాటాకు ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైంది. బాధిత కుటుంబ సభ్యులు వాసవీ అసోసియేషన్ వారికి పరిస్థితి విన్నవించుకున్నారు. ఎన్ఆర్ఐ సహకారంతో రూ. లక్ష చెక్కును సంఘం ప్రతినిధులు వెలగా నారాయణరావు, రాజుకుమార్, పి.కన్నయ్యశెట్టి బాధిత కుటుంబానికి అందజేశారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ


వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న అర్జున

కె.కోటపాడు : అసోసియేషన్ ఫర్ బ్రైట్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్(ఏబీసీడీ) ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్టు సంస్థ కోశాధికారి లెక్కల అర్జున తెలిపారు. కె.కోటపాడు, బత్తివానిపాలెం, ఎ.కోడూరు తదితర గ్రామాల్లో రోడ్డు పక్కన ఉన్న 30 మంది వృద్ధులకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేసినట్టు చెప్పారు.

హోరాహోరీగా 'ఆడుదాం..ఆంధ్రా'

పలు నియోజకవర్గాల్లో ఆడుదాం ఆంధ్రా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. విజయమే లక్ష్యంగా క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు.


కబడ్డీ పోటీల్లో తలపడుతున్న రావికమతం-బుచ్చెయ్యపేట జట్లు


మాడుగులలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్


చోడవరంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో తలపడుతున్న మహిళలు

మాడుగుల రూరల్: క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఆడుదాం - ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తోందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ఆడుదాం- ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.35,000, ద్వితీయ బహుమతిగా రూ.15,000, తృతీయ బహుమతిగా రూ.5,000 నగదుతో పాటు బాడ్మింటన్ డబుల్స్‌లో ప్రథమ బహుమతిగా రూ 20,000, ద్వితీయ బహుమతిగా రూ 10,000, తృతీయగా రూ.5.000 నగదును అందజేసి, క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. ఈ పోటీల్లో 40 జట్లు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, మార్కెట్టు కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, జెడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, ఎంపీడీవో పి.ఎస్.ఎల్. మీనాకుమారి, సర్పంచ్ యడ్ల కళావతి, ఎంపీటీసీ సభ్యురాలు పొలిమేర విజయలక్ష్మి, మండల సచివాలయాల కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం: గ్రామీణ, పట్టణ క్రీడాకారుల్లో క్రీడా సక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. బ్యాంటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడుదాం ..ఆంధ్రా పోటీలకు క్రీడాకారులనుంచి విశేష స్పందన లభించిందన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొని నర్సీపట్నానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఆర్డీవో హెచ్.వి.జయరాం మాట్లాడుతూ సచివాలయ, మండలస్థాయి పోటీలు విజయవంతంగా ముగిశాయని చెప్పారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్ తమరాన అప్పలనాయుడు, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు, ఎంపీడీవో జయమాధవి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీషా బేగం, కర్రి శ్రీనివాసరావు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, కోఆప్షన్ సభ్యులు షేక్ రోజా, లగుడు స్వామి,టౌన్ మున్సిపాలిటీ మహిళా విభాగం అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, వార్డు ఇన్‌చార్జి కె.వరలక్ష్మి , నాలుగు మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

చోడవరం: ఆడుదాం..ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు స్థానిక ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో బుధవారం ప్రారంభమయ్యాయి. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల నుంచి వచ్చిన టీమ్‌లు ఈ పోటీల్లో తలపడ్డాయి. మొదటి రోజు మహిళలు, పురుషుల విభాగాల్లో కబడ్డీపోటీలు జరిగాయి. మహిళల విభాగంలో మొదటి స్థానంలో చోడవరం టీమ్, ద్వితీయస్థానంలో రావికమతం, తృతీయస్థానంలో రోలుగుంట టీమ్‌లు నిలిచాయి. పురుషుల విభాగంలో బుచ్చెయ్యపేట మొదటిస్థానం, రావికమతం రెండో స్థానం, చోడవరం మూడోస్థానం సాధించాయి. పోటీలు రాష్ట్ర స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ జొన్నాడ శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగాయి. నియోజకవర్గం స్పెషలాఫీసర్ కె.రాజేశ్వరి, ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, పీఈటీలు పాల్గొన్నారు. రెండోరోజు గురువారం నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

పేదలకు కార్పొరేట్ వైద్యమే ప్రభుత్వ లక్ష్యం


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: పేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి తెలిపారు. మున్సిపాలిటీ పాతసంతబయలులో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ముందుగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు దాడి బుజ్జి పాల్గొన్నారు.

నాతవరం: ప్రతి వ్యక్తి కంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష, వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాతవరంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శిబిరంలో 98 మందిని, పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. 24మందికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యులు వరహాలు నిర్ధారించారు. వారికి ఆపరేషన్లు నిర్వహించేందుకు శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బస్సులో విశాఖపట్నం తీసుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శి శ్రీను, హైస్కూల్ విద్యా కమిటీ మాజీ చైర్మన్ రెడ్డి వరహాలబాబు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- ఎంకే వల్లాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం


ఎం. కె. వల్లాపురంలో మహిళలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం పాదర్శకంగా నిర్వహిస్తోందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ఎం.కోటపాడు సచివాలయం పరిధిలో గల ఎం.కె.వల్లాపురం, కోటపాడు గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రతి గడపకు సంక్షేమాన్ని అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సాంకేతిక కారణాల రీత్యా ఎవరికైనా పథకాలు మంజూరు కాకపోతే వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పాచినవాని కళ్లాలు వద్ద అనారోగ్య సమస్యతో బాధపడుతున్న బాలుడిని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఎం.కె.వల్లాపురం గ్రామాని చెందిన కరణం పద్మ అనే మహిళ మాట్లాడుతూ తన కుటుంబానికి వైఎస్సార్ ఆసరా, డ్వాక్రా, పింఛను, చేయూత, రైతు భరోసా తదతర సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటి వరకు రూ.5,78,267 లబ్ధి చేకూరినట్టు డిప్యూటీ సీఎంకు వివరించింది. భర్త చనిపోతే భార్య పేరుపై భూమిని ఆన్‌లైన్ చేయాలని పలువురు కోరగా, వెంటనే వీఆర్‌వోను ఆదేశించారు. దివ్యాంగులను పలకరించి వారికి అందుతున్న పథకాల గురించి ఆరా తీశారు. అనంతరం ఘాట్‌రోడ్డు వర్తక సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎంను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, మండల వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు, మండల సచివాలయాలు కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎం.కె.వల్లాపురం సర్పంచ్ కోట్ని లక్ష్మి, ఉప సర్పంచ్ కరణం రాము, ఎం.కోటపాడు ఉప సర్పంచ్ శానాపతి గంగాధర్, మాజీ సర్పంచ్ కోట్ని శ్రీరామూర్తి తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి


పెదమదీనలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

బుచ్చెయ్యపేట : ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. పెదమదీన జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు బుధవారం ఆయన ట్యాబ్‌లను అందజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశయం మేరకు విద్యార్థులు ఉన్నత చదువులపై దృష్టి సారించాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జోగా కొండబాబు, సర్పంచ్ కె.రమణ తదితర్లు పాల్గొన్నారు.

గొలుగొండ: విద్యారంగం అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని ఎంపీపీ గజ్జలపు మణికుమారి, ఏఎల్‌పురం సర్పంచ్ లోచల సుజాత తెలిపారు. ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు బుధవారం వారు ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు.

సచివాలయాల్లోనే జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు


అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు


మాట్లాడుతున్న చోడవరం సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి

కె.కోటపాడు: రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో మంజూరు చేసిన జగనన్న ఇళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు గ్రామ సచివాలయాల్లోనే నిర్వహించనున్నట్టు సబ్ రిజిస్ట్రార్ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పేదలందరికీ ఇళ్ల పథకానికి సంబంధించిన రిజిస్ట్రేషన్లను ఈ నెల 27 నుంచి సచివాలయాల్లోనే జరిపే కార్యక్రమం ప్రారంభం కానున్నట్టు చెప్పారు. కె.కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ, చోడవరం మండలాలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్‌లకు కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. రిజిస్ట్రేషన్ పత్రాల కంప్యూటరీకరణ, వేలి ముద్రల నమోదు విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శంకర్ పాల్గొన్నారు.

చోడవరం:జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్‌లో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చోడవరం సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి సూచించారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పంచాయతీ గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలందరికీ జగనన్న ఇళ్లు పథకంలో ఇచ్చిన లేఔట్లలో ఇళ్లు రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఏ విధంగా రిజిస్ట్రేషన్ చేయాలనే అంశంపై కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. రిజిస్ట్రేషన్లుపూర్తిగా గ్రామ సచివాలయాల్లోనే జరుగుతాయన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇంటిపట్టాకు పూర్తిగా హక్కు కల్పించేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందని ఆమె చెప్పారు.

ఓటు వజ్రాయుధం

ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ


కె.కోటపాడులో నిర్వహిస్తున్న ర్యాలీ

కె.కోటపాడు : ఓటు హక్కే వజ్రాయుధమని, ప్రజాస్వామ్యానికి పునాది అని మండల ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి, తహసీల్దార్ జె.రమేష్‌బాబు అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, అయ్యన్న డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మూడురోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి, ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం నాగలక్ష్మి, రమేష్‌బాబు మాట్లాడుతూ దేశాభివృద్ధిని కాంక్షించే ప్రభుత్వాలను ఓటర్లు నిస్వార్థంగా ఎన్నుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి, ఎంపీడీవో ప్రసాద్, ఎస్ఐ ధనుంజయ్, వెలుగు ఏపీఎం వెంకటలక్ష్మి, ఏఈలు అల్లు శ్వేత, బాలాజీ అప్పారావు, ఏపీవో అప్పలరాజు, ఆర్ఐ జానకి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎడ్ల పరుగు పోటీల విజేత నర్సయ్యపేట

చీడికాడ: జైతవరంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి ఎడ్లపరుగు పోటీల్లో చోడవరం మండలం నర్సయ్యపేటకు చెందిన ముమ్మిన రామకృష్ణ బండి మొదటి స్థానంలో నిలిచింది. తరువాత స్థానాల్లో మహాదేవ్ మోహన్‌శ్యామ్ కుమార్(లక్ష్మీపురం),హర్షవర్ధననాయుడు(దండిసురవరం),సిరి కి దుర్గాప్రసాద్(కె.ఎల్.బిపట్నం),మురుకుర్తి హరి కృష్ణ(చుక్కపల్లి), తాళ్లమ్మతల్లి(జైతవరం),ముమ్మిన కనకరాజు(నర్సయ్యపేట) బళ్లునిలిచాయి.సర్పంచ్ కోడూరి సత్యవతి, గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు.

మహిళలకు మహోన్నత స్థానం


మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్


అవగాహన కల్పిస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శి వరలక్ష్మి

చోడవరం రూరల్: భారతీయ సమాజంలో మహిళలకు మహోన్నత స్థానం ఉందని, మహిళలు ఆత్మ గౌరవంతో ముందడుగు వేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నభారతి అన్నారు. కళాశాలలోని బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ కోఆర్డినేటర్ లక్ష్మీ మంగమ్మ మాట్లాడుతూ ప్రతి స్త్రీ తన కుటుంబంతో పాటు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. సీనియర్ ఉపన్యాసకులు జి.సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు కల్పించిన విశేష అధికారాలను, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు డి.మాల్యాద్రి, కమిటీ సభ్యులు సీహెచ్.జ్యోతి, సరస్వతి, వి.అప్పలనాయుడు, కోమలి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొవ్వూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి జి.వరలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో మహిళల ప్రాముఖ్యత గురించి తెలిపారు. వరకట్న వేధింపులు, సైబర్ నేరాలు గుర్తించడం, వ్యక్తిగత రక్షణ చర్యలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీ రత్నం మాట్లాడుతూ బాలికలు తీసుకోవాల్సిన వ్యక్తిగత ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలను స్థానిక కేజీబీవీలో ఎస్వో తులసి, జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్.ఎం. ప్రసాద్‌రావు నిర్వహించారు.

ఎస్‌ఈబీ ఎస్‌ఐగా రహీమ్


విధుల్లోకి చేరిన రహీమ్

గొలుగొండ: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) ఎస్‌ఐగా రహీమ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ గిరి శ్రీకాకుళం జిల్లాకు బదిలీ కాగా, రహీమ్ శ్రీకాకుళం జిల్లా నుంచి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా రహీమ్ మాట్లాడుతూ గొలుగొండను సారా రహిత ప్రాంతంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

అర్హులందరూ ఓటు హక్కు కలిగి ఉండాలి


ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం:ప్రజా స్వామ్యంలో ఓటు వజ్రాయుధమని ఆర్డీవో హెచ్.వి.జయరాం అన్నారు. నేషనల్ ఓటర్ల డేను పురస్కరించుకుని మండలంలో ధర్మసాగరం పంచాయతీలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఓటు ప్రాముఖ్యతను తెలియజేస్తూ మహిళలు వేసిన ముగ్గుల పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అర్హులైన అందరూ ఓటు హక్కును కలిగి ఉండాలని తెలిపారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు, తహసీల్దార్ అన్నాజీరావు, ఆర్ఐ వెంకటలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా తీర్థమహోత్సవాలు


మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తుల పూజలు


పెదమదీనలో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

కె.కోటపాడు : మండలంలోని మేజర్ పంచాయతీ చౌడువాడలో శ్రీసీతారాముల, చంద్రయ్యపేటలో మల్లికార్జునస్వామి తీర్థమహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. గ్రామాల్లో ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చంద్రయ్యపేట శివాలయంలో సర్పంచ్ సబ్బవరపు పార్వతి, ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు జరిపారు.

పెదమదీనలో ఘనంగా లక్ష్మీనరసమ్మ తీర్థం

బుచ్చెయ్యపేట: మండలంలోని పెదమదీన గ్రామంలో లక్ష్మీపేరంటాల తీర్థమహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కొల్లిమల్ల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ తీర్థంలో నిర్వహించిన ముగ్గులు,ఉట్టుకొట్టు,కుర్చీ ఆట పోటీల్లో పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కిసాన్ సెల్ కార్యదర్శి కె.అచ్చింనాయుడు,సర్పంచ్ రమణ తదితరులు బహుమతులు అందజేశారు.


నేడు వరహాపురంలో...

చీడికాడ: మండలంలోని వరహాపురంలో సీతారాముల తీర్థమహోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి ఎడ్లపరుగు పోటీలు జరపనున్నట్టు చెప్పారు.ఈ పోటీలు మధ్యాహ్నం ప్రారంభమవుతాయని, సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

రోలుగుంట: త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అవసరమైన చర్యలు చేపడుతుందని, అందుకు ప్రజలు సహకరించాలని కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు కోరారు. మండలంలో పలు గ్రామాలను బుధవారం ఆయన ఎస్ఐ ఎల్.సురేష్‌తో కలిసి సందర్శించారు. బీబీ పట్నం, వడ్డిప, రత్నం పేట గ్రామాల్లోని కేంద్రాలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడారు.

కస్వా గ్రోయిన్‌లో జోరుగా పూడిక తీత


జేసీబీతో పూడిక తీస్తున్న దృశ్యం

బుచ్చెయ్యపేట: వడ్డాది కస్వా కాలు వలో పూడిక తీత పనులు జోరుగా సాగుతున్నాయి. కస్వా కాలువ తుప్పలు, డొంకలుతో నిండిపోవడంతో రెండేళ్లుగా సాగు నీరు సక్రమంగా అందడం లేదు. పెద్దేరు రిజర్వేయర్ ప్రధాన కాలువ నిండా పూడిక ఉండడంతో శివారు భూములకు సాగునీరు చేరడం లేదు. రైతులంతా సమిష్టిగా జేసీబీతో పూడికలు తీయిస్తున్నారు. సిమెంట్ లైనింగ్ చేయిస్తే పూడిక ఇబ్బంది తప్పుతుందని సాగునీటి సంఘం అధ్యక్షుడు దాడి పెద గోవింద, రైతు సంఘం నాయకులు సయ్యపురెడ్డి సత్యనారాయణ,నాగేశ్వరరావు తెలిపారు.

ఎం. కోడూరులో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

మాడుగుల రూరల్: ఎం.కోడూరులో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ గోపాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేష్, పడాల అప్పలనాయుడు,చింతా మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు.